# ఎవరు? ఎవరు?



ప్రతాప రవిశంకర్

తమ్ముడి మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు కిరీటి.

నిమిషం తర్వాత "నిజమా?" అనడిగాడు.

"అవును. నిజం. అప్పుడే ఆ ఉత్తరం గురించి నీతో చెప్పనందుకు క్షమించు. చెబుదామనే అనుకున్నాను కాని నాన్న బెదిరించాడు," అన్నాడు రాజు.

"ఆ ఉత్తరంలో ఏముంది?"

"తెలీదు, ఆ ఉత్తరాన్ని నేను చదవలేదు పోస్టుమేన్ దగ్గర్నించి నాన్నే తీసుకుని చదివాడు. తర్వాత ఏదో అంటూ ఆ ఉత్తరాన్ని అగ్గిపుల్ల గీసి అంటించాడు"

"ఎన్నేళ్ళయ్యింది?" అదోలా అడిగాడు కిరీటి.

"సరిగ్గా ఐదేళ్ళయింది."

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"ఆ రోజు సెప్టెంబర్ పన్నెండో తారీకు. ఆ రోజు ఉదయం మా క్లాసులో చదివే రామారావు జ్వరంతో చనిపోయాడని కాలేజీకు సెలవు ఇచ్చారు. ఇంటికి వచ్చి ఏదో పుస్తకం చదువుకుంటూ వుండిపోయాను. నువ్వు బజార్నించి రాలేదు."

కిరీటికి చెప్పలేనంత బాధ కలిగింది. ఆ ఉత్తరాన్ని తన కివ్వకుండా కాల్చివేసినందుకు తండ్రిమీద కోవం వచ్చింది

ఐదేళ్ళక్రితం అతనికి వచ్చిన ఓ ఉత్తరం గురించి అతని తమ్ముడు రాజు ఆ రోజున కిరీటితో చెప్పాడు.

"ఆ ఉత్తరం ఎవరి దగ్గర్నించి వచ్చిందో? అందులో ఏమున్నదో తెలిస్తే బావుండేది" పైకే అన్నాడు కిరీటి

"ఎవరు ఆ ఉత్తరాన్ని రాశారో నాకు తెలీదు—కానీ అందులో ఏముందో కొంచెం చెప్పగలను"

"ఏముంది?"

"ఆ ఉత్తరం ఎవరో అమ్మాయి దగ్గర్నుంచి వచ్చింది అందులో ఆ అమ్మాయి నిన్ను ప్రేమిస్తున్నట్టుగా రాసివుండాలి... నాన్న మాటలనుబట్టి నేనలాగే అనుకున్నాను. ప్రేమ మైకంలో పడితే చెడిపోతారు అంటూ నాన్న ఆ ఉత్తరాన్ని తగలబెట్టాడు."

కిరీటి మనసు విలవిల్లాడిపోయింది.

ఆ క్రితం రోజునే రాజు అతడి దగ్గరకు వచ్చాడు. ఆ రోజు ఉదయం క్యాలెండర్లో సెప్టెంబర్ వన్నెండో తారీకును చూడగానే ఆ ఉత్తరం గురించి గుర్తుకువచ్చి కిరీటితో చెప్పాడు

ఆ అమ్మాయి ఎవరై వుంటుంది?

కిరీటి ఆలోచన చూసి "ఇంటికి వెళ్ళినప్పుడు నేను నాన్నను అడగమంటావా?" అన్నాడు రాజు

అతను అదోలా నవ్వి "అనవసరమనుకుంటాను. నాన్న ఈ విషయం గురించి ఎప్పుడో మరచిపోయివుంటాడు ఒకవేళ ఉత్తరం గురించి గుర్తువున్నా ఆ అమ్మాయి ఎవరో నాన్నకూ గుర్తువుండి వుండదు" అన్నాడు

రాజు మాట్లాడలేదు – ఐదేళ్ళపాటు ఇంత ముఖ్యమైన విషయాన్ని చెప్పనందుకు అతనికి గిల్టీగా వుంది. అతను కొన్నిరోజులు తండ్రికి భయపడి ఆ విషయాన్ని రహస్యంగా వుంచాడు. ఆ తర్వాత దాని గురించి పూర్తిగా మరచిపోయాడు

కిరీటి ఒక్కసారిగా ఐదేళ్ళ వెనక్కు వెళ్ళిపోయాడు తనని ప్రేమించనంటూ ఉత్తరం రాసిన అమ్మాయి ఎవరై వుండే అవకాశం వున్నదో ఆలోచించాడు

ఐదేళ్ళక్రితం అతనికి పరిచయంవున్న అమ్మాయిలు నలుగురే వున్నారు. ఐతే ఆ నలుగురూ పరిచయం–స్నేహం వున్నవాళ్ళే కాని ప్రేమించేంతటి సన్నిహితం వున్నవాళ్ళు కాదు

ఒకవేళ ఆ నలుగుర్లోను ఎవరో ఒకరు ఆ ఉత్తరాన్ని రాసివుండవచ్చుననే అనుమానం కిరీటికి కలిగింది అందుకే అతను ఎలాగైనా ఆ నలుగురినీ కలిసి ఆ ఉత్తరం గురించి ఎంక్వయిరీ చెయ్యాలనీ అనుకున్నాడు.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. మనసంతా చాలా తమాషాగా వుండిపోయింది. హృదయం నిండా చెప్పలేని అనుభూతితో నిండిపోయింది

ఐదేళ్ళక్రితం తను ఓ అమ్మాయి హృదయాన్ని దోచుకున్నాడా? ఓ యువతి అభిమానాన్ని చూరగొన్నాడా?

ఆ ఉత్తరంలో ఆ అమ్మాయి ఏమని రాసింది?

ఏమో?

తండ్రిమీద ఆ తర్వాత తమ్ముడిమీద అతడికి బాగానే కోపం వచ్చింది. ఏమైనా ఇప్పుడు తను చెయ్యగలిగింది ఏమీలేదు.

తను చెయ్యవలసింది ఒక్కటే–

ఆ అమ్మాయి ఎవరో తెలుసుకోవాలి. .

తనతో కొంచెం క్లోజుగా వుండే అమ్మాయి ఎవరు?

రాజేశ్వరి అవును. ఆ ఉత్తరాన్ని రాజేశ్వరి రాసే అవకాశం వుందా? ఉన్నట్టుగానే అనిపించింది కాని తన అంచనా తప్పనికూడా అనిపించింది. ఆ అమ్మాయి తన ఇంటి ఎడ్రసుకు ఉత్తరం



రాయవలసిన అవసరం లేదు అప్పుడప్పుడు తను వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడు. అప్పుడు రాసి ఇచ్చేది ఆ ఉత్తరాన్ని. కాబట్టి ఆ ఉత్తరాన్ని రాజేశ్వరి రాసి వుండదని నిర్ణయించుకున్నాడు

తర్వాత తన కమలముందు ఇందిర కదిలింది

ఇందిరతో తనకు అంతగా పరిచయం లేదు. ఆమె తనతోనే ఇంటర్ చదువుకుంది. ఎప్పుడైనా అవసరం అయినప్పుడు ఏదైనా నోట్సు అడిగి తీసుకునేది. ఎంతో అవసరం అయితేనేగానీ నవ్వేది కాదు. అలాంటి ఇందిర తనకు ప్రేమలేఖ రాస్తుందా?

కిరీటికి నమ్మాలనిపించలేదు.

అప్పుడు అతని ఆలోచనలు సుజాత మీదికి మళ్ళాయి. ఆ అమ్మాయి అతడి స్నేహితుడు వెంకట్ చెల్లెలు. మిల మిల మెరిసే కళ్ళతో ఎంతో హుషారుగా వుండేది. అప్పుడప్పుడు వెంకట్, కిరీటి క్యారమ్స్ ఆడుతున్నప్పుడు తనుకూడా వచ్చి ఆడేది.

ఐతే ఆ అమ్మాయి ప్రవర్తన ఎప్పుడూ తనను ప్రేమిస్తున్నట్టుగా గుర్తు రాకపోవటంతో కిరీటి అనుమానం చివరగా జయంతిమీదకు పరుగుదీసింది

జయంతి బాగా అందమైనది — ఆ అమ్మాయికూడా కిరీటితోపాటు డిగ్రీవరకు చదివింది చురుకుగా వుండే మనుషులంటే తనకి అభిమానమున్నట్టుగా ఆమె తన ఫ్రెండ్స్‌తో చెబుతున్నప్పుడు కిరీటి కొన్నిసార్లు విన్నాడు కిరీటికూడా చురుకయిన మనిషే అంతేకాకుండా అతను చాలాసార్లు క్లాసులో ఫస్టుమార్కులు తెచ్చుకున్నాడు అలా తెచ్చుకున్నందుకు జయంతి అతడిని చాలాసార్లు అభినందించింది.

అలా అభినందిస్తున్నప్పుడు ఆమెకళ్ళు సంతోషంతో మెరియడం అతడికి గుర్తొచ్చింది

ఇంతేకాదు—అప్పుడు కిరీటికి ఇంకో చిన్న సంఘటనకూడ గుర్తుకు వచ్చింది. ఒకసారి తను ఓ సాయంత్రం జయంతి ఇంటిముందునించి వస్తున్నప్పుడు ఆ అమ్మాయి గేటుదగ్గరే నిల్చొనివుండి తనని పలకరించి ఇంట్లోకి ఆహ్వానించింది. తను బిడియపడుతూ లోపలకు వెళ్ళాడు ఆమె తను ఇంటెలిజెంట్ అని తల్లికి చెప్పింది. ఆ తర్వాత కాఫీ ఇచ్చి సాగనంపింది—

హుషారు కలిగింది కిరీటికి—ముఖ్యంగా ఈ సంఘటన గుర్తుకువచ్చిన తర్వాత తప్పకుండా ఆ ఉత్తరాన్ని జయంతే రాసి వుంటు దని అతడికి నమ్మకంగా అనిపించింది.

ఐనా నిర్ధారణ చేసుకోవాలి కాబట్టి కిరీటి ఓ నాలుగురోజుల తర్వాత నాలుగు రోజులు లీవు పెట్టి నెల్లూరు నించి గుంటూరు వెళ్ళాడు

అతడి అదృష్టంకొద్దీ రాజేశ్వరి — ఇందిర — సుజాత గుంటూరులోనే వున్నారు ఎందువల్లనో వాళ్ళు పెళ్ళిచేసుకోకుండా చిన్న ఉద్యోగాలు చేస్తూ వుండిపోయారు

ఆ ముగ్గుర్నీ కలుసుకున్నాడు కిరీటి—వాళ్ళు నొచ్చుకోని విధంగా చాలా మామూలుగా ఆ ఉత్తరం ప్రేమలేఖ అని చెప్పకుండా దాని గురించి ఆ ముగ్గురినీ అడిగాడు

కాని — ఆ ముగ్గుర్లో ఏ ఒక్కరూ అప్పటివరకూ ఏ మగవాడికీ ఒక్క ఉత్తరం కూడా రాయలేదని గట్టిగా చెప్పారు.


సుజాత అతడలా అడిగినందుకు బాగా కోపగించుకుంది కూడా—

ఇక నాలుగో అమ్మాయి.

జయంతి!

ఆ అమ్మాయి గుంటూర్లో లేదు ఏడాదిక్రితం పెళ్ళిచేసుకుని భర్తతో బెంగుళూరు వెళ్ళిపోయిందని తెలిసింది.

కిరీటి బెంగుళూరు వెళ్ళి జయంతిని కలుసుకునే సాహసం చెయ్యలేక పోయాడు ఎందుకంటే తప్పకుండా ఐదేళ్ళ క్రితం సెప్టెంబర్ పన్నెండో తారీకున తన తండ్రి తగలబెట్టిన ఆ ప్రేమ ఉత్తరాన్ని జయంతి రాసివుంటుం




దన్న నిర్ణయానికి అతను ఎప్పుడో వచ్చేశాడు కాబట్టి–

అతడికి పరిచయం వున్న పలుగురు అమ్మాయిలలో జయంతి బాగా అందంగా వుంటుంది.... అంత అందమైన యువతి తనకి ప్రేమలేఖ రాసిందంటే తను ఎంతో అదృష్టవంతుడని కిరీటి అనుకున్నాడు. ఆ సమయంలో అతడికి కూడా జయంతిమీద గాఢమైన ప్రేమ కలిగింది.

అతడికి ఆ ఆలోచన గొప్ప థ్రిల్‌ను ఇచ్చింది. కిరీటికి ఈ విషయాన్ని తల్చుకున్నప్పుడల్లా గొప్ప మధురమైన అనుభూతి కలుగుతోంది.

* * *

"నువ్విక్కడే కూర్చో ట్రెయిన్ ఎంత లేటుగా నడుస్తున్నదో తెలుసుకుని వస్తాను" అన్నాడు కిరీటి చెల్లెలు రజనితో–

విజయవాడ రైల్వేస్టేషన్– సమయం పగలు పదకొండు గంటలు దాటుతోన్నది.

కిరీటి తిరిగివచ్చేసరికి అతడి చెల్లెలు మరో ఆమెతో మాట్లాడుతోంది. ఆమె పక్కనే ముగ్గురు పిల్లలు, కొంత సామాను వున్నాయి.

"తెలుసు కదా ....మా అన్నయ్య కిరీటి" అన్నది రజని ఆమెతో.

తల వూపిందామె.

ఆమెను గుర్తించాడు అతను. ఆమె పేరు సుందరి. అతడిచెల్లెలి క్లాసుమేటు. ఎప్పుడైనా చెల్లెలితో కలిసి కనపడుతూ వుండేది

వాళ్ళిద్దరూ కొంచెంసేపు ఏదో మాట్లాడుకున్నారు.

కొన్ని నిమిషాలు గడిచిన తర్వాత రజని బుక్‌స్టాల్ దగ్గరకు వెళ్ళింది ఏదో మేగజైన్ కొనటానికి–

అప్పుడు అక్కడ ఆమె-కిరీటి మిగిలిపోయారు.

"పెళ్ళిచేసుకున్నారా?" అడిగిందామె.

"లేదు " అన్నాడతను.

"మీ చెల్లెలుకంటే చిన్నదాన్ని అప్పుడే నాకు ముగ్గురు పిల్లలు" అంటూ నవ్వింది

బావుండదని అతనుకూడా నవ్వాడు.

ఉన్నట్టుండి ఆమె ఇలా అన్నది.

"మిమ్మల్నొక విషయం అడగమంటారా?"

"ఏమిటి?"

"దాదాపు ఆరేళ్ళక్రితం నేను మీకో ఉత్తరం రాస్తే కనీసం దానికి జవాబు కూడా ఇవ్వలేదేం?"

ఉలిక్కిపడ్డాడు కిరీటి, "మీరా!" అన్నాడు ఆశ్చర్యంగా—

నిజంగా షాక్

ఆ ఉత్తరాన్ని రాసిందా ఈమేనా!!

కిరీటికి మనసులో ఈటె గుచ్చుకున్నట్టుగా అనిపించింది-బలంగా - దాదాపుగా ఏడాదిక్రితంనించీ తను ఎంతో అపురూపంగా భావిస్తున్న ఆ ఉత్తరం గురించిన గొప్ప థ్రిల్‌నీ, ఒక మధురమైన అనుభూతినీ ఎవరో నిర్దాక్షిణ్యంగా సమూలంగా - తుడిచివేసినట్లు అనిపించింది.

ఆ ఉత్తరాన్ని ఎవరు రాశారో తెలిసినప్పుడు కిరీటికి ఎంతమాత్రం సంతోషం కలగలేదు - పైగా ఎంతో విచారం, బాధ కలిగాయి - ఈమె ఇక్కడ కలిసి ఈ నిజం చెప్పకుండావుంటే ఎంతో బావుండేదని అనుకున్నాడు.

ఎందుకంటే—

సుందరి - ప్రస్తుతం ముగ్గురు పిల్లల తల్లి - ఆరేళ్ళక్రితం కూడా ఎత్తుపళ్ళతో, గుంటకళ్ళతో మొహంమీద పోటకం మచ్చలతో ఎంతో వికృతంగా వుండేది అతడు ఆమెను అసహ్యించుకునేవాడు కూడా—

ఇలాంటి మనిషి హృదయాన్నా తను దోచుకున్నది!

ఈ ఆలోచనే ఇప్పుడు కిరీటిని అమితంగా వేధిస్తున్నది.

